# ఇండియాకిది 'అణుపరీక్ష'

## ఎన్ఎస్జీ సభ్యత్వంపై ఉత్కంఠ

అంతర్జాతీయ వేదికపై భారత్ మరో కఠిన పరీక్షను ఎదుర్కొంటోంది. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో జరుగుతున్న అణు సరఫరాదారుల బృందం(ఎన్ఎస్జీ) సమావేశంలో కీలక నిర్ణయం వెలువడనుంది. ఎన్ఎస్జీ సభ్యదేశం హోదా పొందేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయా లేదా అన్నది తేలిపోనుంది. సాధారణంగా ఎన్ఎస్జీ సమావేశాలకు పెద్ద ప్రచారంగాని, ప్రాధాన్యంగాని ఉండదు. కానీ భారత్, పాక్‌లు తెరమీదకు వచ్చింది మొదలు ఎన్ఎస్జీ కార్యక్రమాలకు విశేష ప్రాధాన్యం లభిస్తోంది. భారత్ 1974లో అణుపరీక్షలు నిర్వహించిన నేపథ్యంలో- అణ్వస్త్రవ్యాప్తిని అడ్డుకునే ఆశయంతో 1975లో ఎన్ఎస్జీ ప్రారంభమైంది. అటుఇటుగా ప్రపంచంలోని 80శాతం యురేనియం నిల్వలను, సుమారు 80శాతం యురేనియం ఉత్పత్తిని ఎన్ఎస్జీ నియంత్రిస్తోంది. అణు పదార్థాలు, సంబంధిత సాంకేతిక పరిజ్ఞానం దారిమారి అణ్వస్త్ర తయారీదారుల పాలబడకుండా కట్టడి చేయడమే ఎన్ఎస్జీ దేశాల ప్రవచిత లక్ష్యం. ఈ ఏడాది మే నెల మధ్యభాగంలో ఎన్ఎస్జీలో సభ్యత్వం కోరుతూ భారత్ దరఖాస్తు సమర్పించింది. ఆ వెన్వెంటనే తనకూ సభ్యత్వం కావాలని అభ్యర్థిస్తూ పాక్ సైతం హడావుడిగా దరఖాస్తు దాఖలు చేసింది. ఆ తరవాత చైనా రంగం మీదకు వచ్చి ఎన్ఎస్జీలో భారత్ సభ్యత్వాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు బహిరంగ ప్రకటన చేయడంతో అంతర్జాతీయ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.




వాషింగ్టన్ అణుభద్రత సమావేశంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ (పాతచిత్రం)

### మారుతున్న సమీకరణలు

కాస్త అటుఇటుగా ఒకే సమయంలో భారత్, పాక్‌లు దరఖాస్తు చేయడంతో అసాధారణ పరిస్థితుల్లో ఎన్ఎస్జీ సభ్యదేశాలు జూన్ మొదటివారంలో సమావేశమయ్యాయి. భారత్, పాక్‌ల సభ్యత్వంపై చర్చించడమే కీలకాంశంగా నిర్వహించిన ఆ సమావేశంలో ఎటూ తేలకపోవడంతో- మొత్తం వ్యవహారం సియోల్‌లో ప్రస్తుతం జరుగుతున్న ప్లీనరీకి బదిలీ అయింది. కానీ, ఎన్ఎస్జీలో భారత్ సభ్యత్వంపై చర్చ పక్కదారిపట్టడం ఆందోళన కలిగిస్తోంది. అణు సరఫరాదారుల బృందంలో చేరికకు భారత్‌కు నికరంగా ఉన్న అర్హతలేమిటి అన్న ప్రధానాంశాన్ని పూర్తిగా పక్కనపెట్టి- రాజకీయాలు, భౌగోళిక సమీకరణల ప్రాతిపదికన చర్చలు సాగుతున్నాయి. భారత్‌కు ఎలాగైనా మోకాలడ్డాలని శతవిధాలా ప్రయత్నిస్తున్న చైనా- అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందా(ఎన్‌పీటీ)న్ని తాజాగా తెరమీదకు తీసుకువచ్చింది. ఎన్‌పీటీపై ఇప్పటివరకూ సంతకాలే చేయని భారత్‌కు ఎన్ఎస్జీలో చోటు కల్పించడం అహేతుకమని వాదిస్తోంది. భారత్, పాకిస్థాన్, ఇజ్రాయెల్‌లు మాత్రమే ఇప్పటివరకు ఎన్‌పీటీపై సంతకాలు చేయలేదు. అయితే, అణు సరఫరా బృందంలో సభ్యత్వాన్ని ఎన్‌పీటీతో ముడిపెట్టడాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. చైనా రెండు నాల్కల ధోరణిని కట్టిపెట్టాలని వాదిస్తున్న భారత్- 1975లో ఎన్ఎస్జీ సంస్థాపక దేశాల్లో ఒకటైన ఫ్రాన్స్ 1992లోగానీ ఎన్‌పీటీపై సంతకం చేయలేదన్న విషయాన్ని బీజింగ్‌కు గుర్తు చేస్తోంది! అదేవిధంగా అర్జెంటీనా సైతం ఎన్‌పీటీలో చేరకుండానే 1994 ఏప్రిల్‌లో ఎన్ఎస్జీ సభ్యదేశంగా మారిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. స్థూలంగా అణు సరఫరాదారుల బృందం మార్గదర్శకాల మేరకు నడుచుకుంటూ, సూత్రప్రాయంగా అణ్వస్త్రవ్యాప్తి నిరోధానికి కట్టుబడటమే ఎస్ఎస్జీ సభ్యత్వానికి అసలు అర్హత అవుతుంది. ఈ విషయంలో భారత్‌ది మచ్చలేని చరిత్ర! దశాబ్దాలుగా భారత్ అణు పరిజ్ఞానాన్ని పూర్తిగా శాంతియుత ప్రయోజనాలకే వినియోగిస్తోంది. ఇతరేతర అవసరాలకోసం అణు పరిజ్ఞానాన్ని వాడుకొనే దేశాలకు అణు పదార్థాలను, సాంకేతికతను భారత్ ఏనాడూ విక్రయించలేదు. ఆ ప్రాతిపదికన ఎన్ఎస్జీలో కాలుమోపేందుకు భారత్‌కు అన్ని అర్హతలూ ఉన్నట్లే లెక్క!

ఎస్ఎస్జీ మొట్టమొదటి ప్లీనరీ సమావేశం 1992లో జరిగింది. అప్పటివరకూ ఉన్న నిబంధనలకు జతగా వార్సా ఒప్పందంలో నూతన మార్గనిర్దేశాలు వెలువరించారు. పౌర, అణ్వస్త్ర అవసరాలకు రెండు రకాలుగా ఉపయోగించుకోగలిగిన అణు పదార్థాల బదిలీపై ఆ సమావేశం విస్పష్ట మార్గనిర్దేశకాలు జారీచేసింది. అణు పదార్థాలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ సందర్భంగా అనుసరించాల్సిన రక్షణ చర్యలనూ ఎన్ఎస్జీ గుదిగుచ్చింది. ఎన్ఎస్జీ సభ్యరాజ్యాలు ప్రపంచంలో ఏ దేశానికైనా అణు పదార్థాలు, పరిజ్ఞానం సరఫరా చేయాలంటే- ఆయా దేశాలు అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) నిబంధనలకు కట్టుబడి ఉండాలి. అణ్వస్త్ర సంపన్నమైన భారత్‌కు ఇబ్బంది కలిగించిన నిబంధన అది. మన దేశంలోని అణు కేంద్రాలు చాలావరకు ఐఏఈఏ నిబంధనలకు అనుగుణంగా లేవు. కాబట్టి కీలకమైన ముడిపదార్థాలను, విడిభాగాలను ఎన్ఎస్జీనుంచి దిగుమతి చేసుకోవడం కష్టమైంది. ఫలితంగా దేశంలోని అణు కేంద్రాలను ఉన్న కొద్దిపాటి కనిష్ఠ 'లోడ్' సామర్థ్యం మేరకు నడుపుకోక తప్పని నిస్సహాయతలో భారత్ పడిపోయింది. ఆ పరిస్థితుల్లోనే 2005లో అప్పటి భారత ప్రధాని మన్మోహన్ సింగ్, నాటి అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ పౌర అణు ఒప్పందం తెరపైకి తీసుకువచ్చారు. భారత్-అమెరికాల మధ్య పౌర అణు సహకారానికి ఆ ఒప్పందం తలుపులు తెరచింది. ఎన్ఎస్జీలో భాగస్వామి కాకపోయినా, ఆ దేశాలతో పౌర అవసరాలకు ఉద్దేశించిన అణు వాణిజ్యం నెరపేందుకు వీలుగా 2008లో భారత్‌కు మినహాయింపు లభించడం మరో కీలక పరిణామం. అమెరికా, రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి దేశాల మద్దతుతో ఎన్ఎస్జీనుంచి మినహాయింపులు పొందడం ద్వారా- దేశంలోని వివిధ ప్రాంతాల్లో అణు కేంద్రాలు నిర్మించాలంటూ జనరల్ ఎలక్ట్రిక్, వెస్టింగ్‌హౌస్, అరెవా వంటి అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానించే అవకాశం భారత్‌కు ఏర్పడింది. అమెరికాతో 2005లో కుదిరిన పౌర అణు ఒప్పందం, ఎన్ఎస్జీనుంచి 2008లో పొందిన మినహాయింపు వల్ల భారత్‌కు ఎంతో వెసులుబాటు కలిగింది. కెనడా, కజకిస్థాన్, ఆస్ట్రేలియా వంటి దేశాలనుంచి యురేనియం దిగుమతికి; ప్రపంచవ్యాప్తంగా మరో పదిహేను దేశాలతో పౌర అణు ఒప్పందాలు కుదుర్చుకునేందుకు భారత్‌కు వీలు చిక్కింది. ఇన్ని అవకాశాలు చేతికొచ్చాక ఎన్ఎస్జీలో చేరితే భారత్‌కు కొత్తగా ఒరిగేదేమిటన్న ప్రశ్న తలెత్తడం సహజం! 1992నాటి ఎన్ఎస్జీ వార్సా ప్లీనరీలో అణ్వాయుధ తయారీకి, పౌర అవసరాలకు రెండు విధాలా పనికొచ్చే పదార్థాల సరఫరాపై మార్గదర్శకాలు సవరించారు. ఎన్ఎస్జీనుంచి అణు, సాంకేతిక పరిజ్ఞానం దిగుమతి చేసుకోదలచిన ఏ దేశమైనా ద్వంద్వ వినియోగార్హ పదార్థాలను ఐఏఈఏ నిర్దేశితరక్షణల మధ్య పరిరక్షించుకోవాలి. భారత్‌లో ఉన్న అణ్వస్త్ర స్థావరాలన్నింటిపైనా అంతర్జాతీయ తనిఖీ లేదు! ఈ నేపథ్యంలో ఎన్ఎస్జీనుంచి యురేనియం దిగుమతికి అవరోధాలు ఎదురవుతున్నాయి. మరోవంక దేశాభివృద్ధి క్రమంలో అణు పరిజ్ఞానం తప్పనిసరి అవసరంగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో ఎన్ఎస్జీలో సభ్యత్వం లభించని పక్షంలో అనేక సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోతాయి. ఇకమీదట ఎన్ఎస్జీ దేశాలు చెప్పే ప్రతి నిబంధనకూ తలొగ్గాల్సి ఉంటుంది. ఒకవేళ ఎన్ఎస్జీలో చోటు లభిస్తే ప్రపంచ మార్కెట్లతో అనుసంధానం సులభమవుతుంది. దేశంలో అణు కేంద్రాల నిర్మాణమూ సాఫీగా ముందుకు సాగుతుంది.

### పాకిస్థాన్ పేరిట పేచీ

అణుసరఫరా బృందంలో భారత్‌కు చోటు దక్కకుండా చైనా శాయశక్తులా కృషి చేస్తోంది. దాన్ని దాటుకుని బృందంలో కాలుమోపాలంటే అందుకోసం భగీరథ ప్రయత్నమే చేయాల్సి ఉంటుంది. ఎన్ఎస్జీలోని 48సభ్య దేశాలకూ 'వీటో' అధికారం ఉంది. కాబట్టి, 'వీటో' అస్త్రం ప్రయోగించి భారత్ ఆగమనాన్ని అడ్డుకోవడం చైనాకు పెద్ద కష్టమేమీ కాదు. మరోవంక భారత్, అమెరికాల మధ్య గడచిన కొన్నేళ్లుగా పెరుగుతున్న సాన్నిహిత్యంపట్ల చైనా తీవ్ర అసహనంతో ఉంది. తన అసంతృప్తిని వెళ్లగక్కేందుకు ఎన్ఎస్జీని అది వేదికగా మలచుకుంటోంది. ఒకవేళ భారత్‌కు ఎన్ఎస్జీలో సభ్యత్వం ఇవ్వాల్సి వస్తే పాకిస్థాన్‌కూ ఆ అవకాశం ఉండాలని చైనా వాదిస్తోంది. అణు పరిజ్ఞాన వినియోగంలో భారత్‌కు ఉన్న సచ్ఛరిత్ర పాకిస్థాన్‌కు లేదు. అక్రమ మార్గాల్లో అణు పదార్థాలు సమీకరించి, వాటి సాయంతో అణ్వాయుధాలు రూపొందించుకున్న మకిల చరిత్ర ఇస్లామాబాద్ నాయకత్వానిది! ఈ నేపథ్యంలో భారత్-పాక్‌లను ఒకే గాటన కట్టి వాదించడం ఎట్టిపరిస్థితుల్లోనూ సరికాదు. అమెరికా ఇప్పటికే భారత్‌కు తన సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కానీ, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధం ప్రాతిపదికన న్యూజిలాండ్, ఐర్లాండ్, టర్కీ, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రియా వంటి దేశాలు భారత్‌ను వ్యతిరేకిస్తున్నాయి. ఎన్ఎస్జీనుంచి భారత్‌కు మినహాయింపు ఇప్పించేందుకు 2008లో అమెరికా తన పలుకుబడినంతా ఉపయోగించినట్లుగానే- ఇప్పుడూ అదే స్థాయిలో కృషిచేస్తే అనేక దేశాల ధోరణిలో మార్పు రావచ్చు. వివిధ దేశాలను దారికి తెచ్చుకునే క్రమంలో భారత్‌సైతం దౌత్యపరంగా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. మెక్సికో, స్విట్జర్లాండ్‌లలో పర్యటించడం ద్వారా ప్రధాని మోదీ వాటి మద్దతు కూడగట్టగలిగారు. ఎన్ఎస్జీలో ఏ ఒక్క దేశం వద్దన్నా భారత్ సభ్యత్వ అవకాశాలకు గండిపడే పరిస్థితుల్లో చైనాను ఎంతమేరకు నిలువరించగలరన్నదే కీలకం! ఆ క్రమంలో కీలక అనుసంధాన కర్తలుగా అమెరికా, రష్యాలు పోషించే పాత్ర- ఎన్ఎస్జీలో భారత్ భవిష్యత్తును నిర్దేశించనుంది.

– అరుణ్ విశ్వనాథన్

(రచయిత– బెంగళూరులోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్'లో సహాయ ఆచార్యులు)

### ఎన్ఎస్జీ... పుట్టుపూర్వోత్తరాలు

NSG
Nuclear Suppliers Group

- **1974:** భారత్ అణ్వస్త్ర పరీక్షలు జరిపిన నేపథ్యంలో- అందుకు ప్రతిస్పందనగా అణ్వస్త్ర దేశాలు ఎన్ఎస్జీకి శ్రీకారం చుట్టాయి.
- **1978:** అంతర్జాతీయ అణుఇంధన సంస్థ (ఐఏఈఏ) ఎన్ఎస్జీ మార్గదర్శక సూత్రాలను ప్రకటించింది.
- **1990:** ఎన్‌పీటీ సమీక్ష సమావేశం, ఎన్ఎస్జీ కార్యకలాపాల్లో మార్పులపై అనేక సిఫార్సులు చేసింది.
- **1992:** అణ్వస్త్ర సంబంధ ముడిసరకులు, పరికరాలు, పరిజ్ఞాన బదిలీకి సంబంధించి మార్గదర్శకాల ప్రకటన
- **2000:** అణు పదార్థాల సరఫరాకు సంబంధించిన విధివిధానాలు గుదిగుచ్చుతూ సమగ్ర సమాచార పత్రం విడుదల
- **2004:** జాబితాలో లేని పదార్థాలతో అణ్వస్త్రాలను తయారుచేసే పెడ ధోరణుల నివారణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుకు అంగీకారం
- **2005:** అణుపదార్థాల ఎగుమతి దిగుమతి దేశాలు వాటిని సురక్షిత వాతావరణంలో కాపాడుకోవడానికి సంబంధించి తీసుకుంటున్న చర్యలను వెల్లడించాలని నిర్ణయం
- **2008:** ఐఏఈఏ భద్రత నిబంధనల పరిధిలో భారత్‌కు పౌర అణు సహకారంపై విధాన ప్రకటనకు ఆమోదం
- **2010:** సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ ధోరణులకు భద్రత సవాళ్లకు అనుగుణంగా పనిచేయడానికి ప్రత్యేక సమీక్షా బృందాల ఏర్పాటుకు నిర్ణయం
- **2013:** ఐఏఈఏ ప్రకటించిన 54 సవరణలపై సమీక్ష